సాక్షి ప్రకాశం

గురువారం । 26 । డిసెంబర్ । 2024



అరటి రైతు గెలగిల

అరటికి మార్కెట్‌లో ధరలు బాగా పడిపోవడంతో రైతులు నష్టపోతున్నారు. జిల్లాలో 1500 ఎకరాల కుపైగా అరటి సాగు చేశారు. అరటి గెల రూ.100 నుంచి రూ.150కి పడిపోయాయి - 8లో..



నమ్మకంగా ఉంటూ నగలు కొట్టేసింది

బంధువుల అమ్మాయిలా ఇంటికి వచ్చి బీరువా తాళాలను తీసి అందులో ఉన్న రూ.12.50 లక్షల విలువైన 25 సవర్ల బంగారు నగలను ఓ మహిళ దొంగిలించింది - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 24/21

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు పడతాయి. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రాపిడ్ చెస్ చాంపియన్ షిప్‌లో కుమార స్వామికి మూడో స్థానం

ఒంగోలు వన్‌టౌన్: రాష్ట్ర స్థాయి రాపిడ్ చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన పోలూరి కుమార స్వామి మూడో స్థానం కైవసం చేసుకున్నారు. జంగారెడ్డి గూడెంలో ఈనెల 24, 25వ తేదీల్లో రాష్ట్ర స్థాయి రాపిడ్ చెస్ చాంపియన్ షిప్ 2024 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న కుమార స్వామి మూడో స్థానంలో నిలిచారు. ఫిబ్రవరి 20 నుంచి 23వ తేదీ వరకూ ఝార్ఖండ్‌లో జరిగే రాపిడ్ నేషనల్ సీనియర్ చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారు.

కొత్త ఆలోచనలతో ముందుకు సాగుదాం

- డీఎంహెచ్‌వో డా.వెంకటేశ్వర్లు



నూతన సంవత్సరం కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ డా.వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: నూతన సంవత్సరంలో కొత్త ఆలోచనలతో ముందుకు సాగుదామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. వెంకటేశ్వర్లు అన్నారు. ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ప్రచురించిన నూతన సంవత్సరం డైరీ, కేలండర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా ప్రజలకు సక్రమంగా వైద్య సేవలు అందించేలా పనిచేయాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు. సమష్టిగా పనిచేయడం వలన లక్ష్యాలు సాధించడం సులువవుతుందని చెప్పారు. డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు రాష్ట్ర ఎన్‌హెచ్‌ఎం జేఏసీ జనరల్ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ ఎస్. ఏడుకొండలు, ప్రసన్న, విజయలక్ష్మి, సుబ్బలక్ష్మి, శ్రీధర్ తదితరులు అభినందించారు.

మెరుగైన వైద్య సేవలు అందిస్తాం

- బాధ్యతలు చేపట్టిన డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు



డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: జిల్లాలోని మారుమూల ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తానని డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి నిర్దేశిత లక్ష్యాలు సాధించేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ వైద్యశాలలకు చెందిన వైద్యులు, నర్సింగ్ స్టాఫ్ తదితరులతో కలిసి సమన్వయంగా పనిచేస్తామని చెప్పారు. వెంకటేశ్వర్లు ప్రస్తుతం బాపట్ల వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు జిల్లా వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

జిల్లాలో సరాసరి 6.9 మి.మీ వర్షపాతం

- అత్యధికంగా కొండపిలో 17.2 మి.మీ

ఒంగోలు అర్బన్: జిల్లాలో బుధవారం సరాసరి 6.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కొండపి మండలంలో 17.2 మి.మీటర్లు నమోదు కాగా పుల్లలచెరువు 16, కొత్తపట్నం 15.6, జరుగుమల్లి 12.6, సంతనూతలపాడు 11.8, తాళ్లూరు 11.6, ముండ్లమూరు 11.2, యర్రగొండపాలెం, ఒంగోలు 10.6, చీమకుర్తి 10.2, మర్రిపూడి 9.8, సింగరాయకొండ 9.4, నాగులుప్పలపాడు 9.2, మద్దిపాడు 8, కొనకనమిట్ల 7, దోర్నాల, టంగుటూరు 6.8, పొన్నలూరు 6.4, పొదిలి 6.2, త్రిపురాంతకం, కురిచేడు, తర్లుపాడు 5.4, దర్శి 5.2, పెదచెర్లోపల్లి 4.6, మార్కాపురం 3.8, అర్ధవీడు, సీఎస్‌పురం, పామూరు 3.6, దొనకొండ, కనిగిరి 3, గిద్దలూరు, వెలిగండ్ల 2.8, పెద్దారవీడు, కొమరోలు 2.6, కంభం 2.4, రాచర్ల 2.2, హెచ్‌ఎంపాడు, బేస్తవారిపేట మండలాల్లో 2 మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

నేడు ఇంటర్ డిస్ట్రిక్ట్ క్యాడెట్ టీం ఎంపిక

ఒంగోలు టౌన్: పదో ఏపీ డిస్ట్రిక్ట్ క్యాడెట్ అండర్ 17 ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ 2024–25 పోటీలకు గురువారం సాయంత్రం ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ సెక్రటరీ జీ.నవీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1.1.2008 నుంచి 21.12.2011 మధ్యలో పుట్టిన స్త్రీ, పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. నగరంలోని ఆనంద్ మినీ స్టేడియంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కేడెట్ టీమ్ సెలక్షన్‌కు హాజరయ్యేవారు అసోసియేషన్ ఐడీ కార్డు జిరాక్స్‌తో పాటుగా ఆధార్, బర్త్ సర్టిఫికెట్లు తీసుకొని రావాలని కోరారు. పూర్తి వివరాలకు 8978905694, 7671991147 ఫోన్ ద్వారా సంప్రదించాలని తెలిపారు.





ఒంగోలు జేఎంబీ చర్చిలో దైవప్రసంగం చేస్తున్న పాస్టర్ అగస్టీన్, ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



ఒంగోలులోని పునీత చిన్నథెరీసమ్మ చర్చిలో క్యాండిల్స్ వెలిగిస్తున్న యువతులు

క్రీస్తు జననం.. లోక పావనం

మరియ తనయుడు ఏసుక్రీస్తు జన్మించిన క్రిస్మస్ పర్వదినాన్ని బుధవారం జిల్లాలోని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిలలో పాస్టర్లు దైవసందేశాన్ని వినిపించారు. క్రైస్తవులు పెద్ద ఎత్తున చర్చిలకు వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్తుతిగీతాలను ఆలపించారు. చిన్నారులు క్రీస్తు జనన ఘట్టాల దృశ్య రూపాలను ప్రదర్శించారు. క్రిస్మస్ కేక్‌లు కట్ చేశారు. పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

- సాక్షి నెట్‌వర్క్

తమ్ముళ్ల కన్ను పడితే..

కూటమి నేతలు భూబకాసురుల్లా బరి తెగిస్తున్నారు. రూ.కోట్ల విలువైన భూముల విషయంలో కోర్టు ఆర్డర్లను బేఖాతరు చేస్తున్నారు. ప్రభుత్వ భూమైనా, ప్రైవేటు భూమైనా వారి కన్ను పడితే చాలు జెండా పాతేస్తున్నారు. ఆ వైపు కన్నెత్తి చూసినా కేసులు పెడతామని బెదిరిస్తారు. అధికారులను గుప్పెట్లో పెట్టుకుని కబ్జా చేసిన భూముల్లో కట్టడాలు కట్టేస్తున్నారు. గతంలో వాటిని అడ్డుకున్న అధికారులు ఇప్పుడు కళ్లప్పగిస్తూ చూడడం తప్ప అడ్డుకోవడం లేదు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు పెట్టి శిక్షిస్తామంటూ ప్రభుత్వ పెద్దలు ఊదరకొడుతున్నా.. క్షేత్ర స్థాయిలో తెలుగు తమ్ముళ్లకు ఆ హెచ్చరికలు వర్తించడం లేదు.

- పెదవెంకన్నపాలెంలో దర్జాగా ప్రభుత్వ భూముల కబ్జా
- వాగుపోరంబోకు ఆక్రమించి.. గోకులం షెడ్ నిర్మాణం
- తిమ్మపాలెంలో బండి బాట స్థలంలో బ్యారన్లు
- నోరెత్తని రెవెన్యూ అధికారులు



పొన్నలూరు:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాల్లోని తెలుగు తమ్ముళ్లు యథేచ్ఛగా భూ అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమంగా కట్టడాలు నిర్మించవద్దని గ్రామస్తులు కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చినా పట్టించుకోవడంలేదు. అవేవీ మాకు వర్తించవంటూ నియోజకవర్గ ముఖ్య నేతల అండదండలతో అధికారులను, స్థానికులను బెదిరిస్తూ నిబంధనలను తుంగలో తొక్కేస్తున్నారు. అక్రమాలకు తెరతీస్తున్నారు. మండలంలోని పెదవెంకన్నపాలెం గ్రామంలో సర్వే నంబర్ 99/1లో 54.50 ఎకరాల వాగు పోరంబోకు భూమి ఉంది. ఈ భూమి తారు రోడ్డుకు ఇరువైపులా గ్రామానికి సమీపంలో ఉంటుంది. ఈ భూమి విలువ సుమారుగా రూ.60 లక్షల వరకు ఉంటుంది. విలువైన ఆ భూమిపై అధికారపార్టీ నాయకుల కన్ను పడింది. ఒక్కసారిగా ఆక్రమిస్తే తేడాలు వస్తాయని భావించారు. ముందుగా వరిగడ్డి వాములు, గేదెల దొడ్లను ఏర్పాటు చేసుకున్నారు. ఆ తరువాత గుట్టుచప్పుడు కాకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. వాస్తవంగా 2012లో బీసీలు తమకు ఇళ్ల స్థలాలు లేవని గ్రామానికి సమీపంలో ఉన్న వాగుపోరంబోకు భూమిలో గుడిసెలు వేశారు. అయితే అప్పటిలో విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని సందర్శించి గుడిసెలను తొలగించారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే నిర్మాణాలు చేపడితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు సైతం చేశారు. అదే సమయంలో గ్రామంలోని కొందరు వాగు పోరంబోకు భూమిని ఎవరూ ఆక్రమించుకోకూడదంటూ 2013లో కోర్టు నుంచి స్టే తీసుకొచ్చారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొందరు అధికారపార్టీ నాయకులు 2015 మార్చి నెలలో వారి అనుకూల వ్యక్తులను పురమాయించి గ్రామానికి సమీపంలో ఉన్న వాగు పోరంబోకు భూమిలో గుడిసెలు వేశారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారి స్పందించి వాటిని గుడిసెలను తొలగించారు. ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామంటూ మరో మారు హెచ్చరించారు.

మళ్లీ అక్రమ కట్టడాలకు శ్రీకారం...

రెవెన్యూ అధికారుల హెచ్చరికలతో ఆ స్థలం వైపు ఎవరూ వెళ్లలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ తెలుగు తమ్ముళ్ల కన్ను వాగుపోరంబోకు భూమిపై పడింది. అధికారాన్ని అడ్డంపెట్టుకుని అక్రమ నిర్మాణాలకు తెరతీశారు. నియోజకవర్గ పెద్దల అండతో వారు రెచ్చిపోతున్నారు. తమను అడిగేవారు లేరంటూ యథేచ్ఛగా వాగుపోరంబోకు భూమిలో అక్రమంగా గోకులం షెడ్డును నిర్మిస్తున్నారు. కొందరు గ్రామస్తులు ఈ అక్రమ కట్టడాన్ని ప్రశ్నించినా దౌర్జన్యానికి దిగుతున్నారు. ఇప్పటికే సిమెంట్ పిల్లర్లు పోసి మట్టితో చదును చేశారు. నాడు నిర్మాణాలను అడ్డుకున్న అధికారులు సైతం నేడు విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించేస్తున్నా పట్టీపట్టనట్టు వ్యవహరించడం గమనార్హం.

పట్టించుకోని అధికారులు

రెండు గ్రామాల్లో విలువైన ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన తెలుగు తమ్ముళ్లు వారి స్వప్రయోజనం కోసం అక్రమ కట్టడాలు నిర్మిస్తుంటే సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు పెట్టి శిక్షిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఊదరకొడుతున్నా క్షేత్ర స్థాయిలో తెలుగు తమ్ముళ్లకు చట్టాలేమీ వర్తించడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విలువైన ప్రభుత్వ భూములను అక్రమార్కుల చెర నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

బండిబాట దారి స్థలంలో బ్యారన్ల నిర్మాణం

చెరుకూరు రెవెన్యూ పరిధిలోని తిమ్మపాలెంలో సర్వే నంబర్ 737/1లో 1.14 ఎకరాల బండిబాట స్థలం ఉంది. అయితే గ్రామంలోని టీడీపీ నాయకులు బండి బాట స్థలాన్ని ఆక్రమించి దర్జాగా పొగాకు బ్యారన్‌లు నిర్మించేస్తున్నారు. ఐదేళ్ల కిందటా బండిబాట స్థలం ఆక్రమించి బ్యారన్‌లు నిర్మిస్తుంటే గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సంబంధిత అధికారులు స్పందించి బండిబాటలో నిర్మిస్తున్న కట్టడాలను అడ్డుకున్నారు. ప్రభుత్వం స్థలంలో అనుమతులు లేకుండా నిర్మాణాలకు పూనుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో అక్రమ నిర్మాణాలను తాత్కాలికంగా నిలిపేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో పెద్ద నాయకులు అండదండలతో మళ్లీ బండిబాట ప్రభుత్వ స్థలంలో అక్రమంగా మూడు బ్యారన్లు నిర్మిస్తున్నారు. గ్రామస్తులకు ఉపయోగపడే బండిబాట స్థలంలో టీడీపీ నాయకులు అక్రమ నిర్మాణాలను కొందరు గ్రామస్తులు అడ్డుకొని ప్రశ్నించినా వారిపై కేసులు పెడతామని బెదిరించడంతో వారు విరమించుకున్నారు. అలాగే బండిబాట స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని గ్రామస్తులు కొందరు కోర్టు నుంచి స్టే తీసుకొచ్చారు. అయినా కోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తూ యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే బండిబాట స్థలంలో టీడీపీ సానుభూతిపరులు నిర్మిస్తున్న బ్యారన్‌లకు పొగాకు బోర్డు అధికారుల నుంచి అనుమతి లేకపోవడం గమనార్హం. ఎలాంటి అనుమతి లేకుండా, లైసెన్స్ లేకుండా అక్రమంగా బ్యారన్‌లు నిర్మించడం కొసమెరుపు.



తిమ్మపాలెంలో బండిబాట దారిలో బ్యారన్లు నిర్మిస్తున్న తెలుగు తమ్ముళ్లు



పెదవెంకన్నపాలెంలో వాగుపోరంబోకు భూమిలో గోకులం షెడ్డు నిర్మిస్తున్న దృశ్యం

టమోటా..

- పడిపోయిన టమోటా ధరలు
- నష్టాల్లో రైతులు

పెద్దారవీడు: ఖరీఫ్ సీజన్లో టమోటా పంట సాగు చేసిన రైతులు డీలా పడ్డారు. మండల పరిధిలో దాదాపు 200 ఎకరాలు టమోటా పంట రైతులు సాగు చేశారు. మొక్కలు నాటిన దగ్గర నుంచి కాయలు కోసే వరకు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన టమోటా రైతుల కంట కన్నీరు ఉబుకుతోంది. పంట సాగు కోసం అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులు కూడా రావని దిగాలు చెందుతున్నారు. ఎకరా పొలంలో మొక్కలు నాటిన దగ్గర నుంచి కాయలు కోత కోసే వరకు, కూలీలకు, రసాయన మందులకు దాదాపు రూ.40 వేల పెట్టుబడి అవుతుంది. మార్కాపురం మార్కెట్లో 25 కేజీలు బాక్స్ రూ.80 నుంచి రూ.100 లకు ధర పడిపోవడంతో కాయలు కోసిన కోత కూలీ కూడా రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 25 కేజీల బాక్స్ కనీసం రూ.200 పైగా ధర పలికితేనే గిట్టుబాటవుతుందని రైతులు తెలిపారు. కనీసం కిలో రూ.10 లకు మద్దతు ధర కూడా పలకడంలేదని ఆందోళన చెందుతున్నారు. పంట దిగుబడి వచ్చే సమయానికి ధరలు పడిపోవడంతో నష్టాలు మిగులుతున్నాయని వాపోతున్నారు. కాయలు కోసినందుకు రోజుకు ఒకరికి రూ.300 కూలీ, మార్కాపురం మార్కెట్‌కు ఆటోలో బాక్స్‌కు రవాణా చార్జీ రూ.30, మార్కెట్లో ఒక బాక్స్ దిగుమతి రూ.5, కమీషన్ రూ.5 ప్రకారం ఖర్చు వస్తుందని రైతులు తెలిపారు. ప్రభుత్వం టమోటాకు మద్దతు ధర కల్పించి, నష్టాల నుంచి బయట పడేలా ఆదుకోవాలని కోరుతున్నారు.



పెద్దారవీడులో సాగు చేసిన టమోటా పంట



మార్కెట్‌కు తరలించేందుకు టమోటా బాక్స్‌లు

గిట్టుబాటు ధర కల్పించాలి:



ఎకరా పొలంలో టమోటా పంట సాగు చేశాను. కాయలు కోత కూలీ, రవాణా ఖర్చులు కూడా రావడంలేదు. గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలు వస్తున్నాయి. పంటకు పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి కూడా కనిపించడం లేదు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచని దుస్థితిలో ఉన్నాను. ప్రభుత్వం టమోటా రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– దుదేకుల నాగులమీరావలి, పెద్దారవీడు గ్రామం

నేడు సీపీఐ శతవార్షికోత్సవ సభ


ఒంగోలు టౌన్: భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) శత వార్షికోత్సవ సభ బుధవారం అద్దంకి బస్టాండు సెంటర్లో నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు మల్లయ్యలింగం భవనం వద్ద సీనియర్ నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు పార్టీ జెండాను ఆవిష్కరిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 4 గంటలకు జిల్లా సీపీఐ కార్యాలయం నుంచి చర్చి సెంటర్, ట్రంక్ రోడ్డు, అద్దంకి బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, కొత్త కూరగాయల మార్కెట్, కొచ్చిన్ కేఫ్, కోర్టు సెంటర్, సీవీఎన్ రీడింగ్ రూమ్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తారని వివరించారు. అనంతరం సీవీఎన్ రీడింగ్ రూం ఆవరణలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, పీజే చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. పార్టీ అభిమానులు, కార్యకర్తలు, కార్మిక సంఘం, రైతు సంఘం, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై పోరాడాలి



రాజ్యాంగ ప్రతులను దహనం చేస్తున్న దళిత హక్కుల పరిరక్షణ సమితి నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై పోరాడాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు అన్నారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం ఒంగోలు హెచ్‌సీఎం కళాశాల ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ 1927వ సంవత్సరం డిసెంబర్ 25వ తేదీ మహారాష్ట్రలోని మహద్ పట్టణంలో అంటరానితనం, కుల వివక్ష, పౌరహక్కుల నిరాకరణకు నిరసనగా వేలాది మంది ప్రజల సమక్షంలో అంబేడ్కర్ మనుస్మృతి ప్రతులను దహనం చేశారన్నారు. 2024లో కూడా సమాజంలో అంతరాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేశారన్నారు. 74 సంవత్సరాల రాజ్యాంగ సమీక్షలో అమిత్ షా ఉద్దేశపూర్వకంగా అవమానించారన్నారు. కార్యక్రమంలో వై సుబ్రహ్మణ్యం, కే రవి, డీ వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆరుగాలం శ్రమించి పండించిన అరటి పంటకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో బోర్లల్లో వచ్చీ రానీ నీటితో సాగు చేసుకున్న అరటికి మార్కెట్‌లో ఆశించిన ధర దక్కకపోవడంతో రైతులు మనోవేదనకు గురవుతున్నారు. అదే సమయంలో దళారులు పైసా పెట్టుబడి లేకుండా ఇదే అరటిపళ్లను అడ్డుపెట్టుకుని భారీగా లాభాలు గడిస్తున్నారు. అరటి ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ 18.1 శాతంతో దేశంలోనే అగ్రగామిగా ఉందని ఆర్బీఐ ఇటీవల ఇచ్చిన నివేదికలో పేర్కొంది. ఇది చెప్పుకోవడానికి గొప్పగానే ఉన్నా తమ కష్టానికి విలువ లేకుండా పోతోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అరటి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై 'సాక్షి' ఫోకస్

అరటి రైతు గెలగిల!

గిట్టుబాటు ధర లేక రైతుల దిగాలు

- గుంటూరు మార్కెట్‌లో అరటి ధరలు తగ్గుముఖం
- గతంలో రూ.300కు పైగా ఉన్న గెల ధర రూ.100 పడిపోయిన వైనం
- పెట్టుబడి లేకుండానే లాభాలు పొందుతున్న దళారులు
- కష్టం చేసిన రైతులకు మిగులుతోంది నష్టాలే..
- గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలంటున్న రైతులు
- జిల్లాలో సుమారు 1500 ఎకరాల్లో అరటి సాగు

కంభం:

కరువు నేల పశ్చిమ ప్రకాశంలో అరటి రైతులు విలవిల్లాడుతున్నారు. కాసులు కురిపిస్తుందని భావించి, కష్టాలకోర్చి పండించిన పంటకు మద్దతు ధర దక్కకపోవడమే అందుకు కారణం. ఉద్యానవన శాఖ అధికారులు ఈ క్రాప్ గణాంకాల ప్రకారం జిల్లాలో 1061 ఎకరాల్లో అరటి సాగులో ఉంది. ఈ క్రాప్ చేయని అరటి తోటలను కలిపితే జిల్లాలో సాగు విస్తీరణం 1500 ఎకరాలకు పైగానే ఉంటుందని అంచనా. కంభం, గిద్దలూరు, బేస్తవారిపేట, దోర్నాల, యరగొండపాలెం, రాచర్ల, కొమరోలు మండలాల్లో రైతులు అధికంగా అరటి సాగు చేస్తున్నారు. గతంలో కంభం చెరువు ఆయకట్టు కింద రైతులు అధికంగా చెరకు సాగు చేసేవారు. అడవి పందుల బెడద ఎక్కువగా ఉండటంతో రైతులు చెరకు సాగు పూర్తిగా వదిలేసి పెట్టుబడి ఎక్కువైనప్పటికీ అరటి తోటలు పెంచడం మొదలుపెట్టారు. మొదటి సారి వేసినప్పుడు అరటి తోటకు ఎకరాకు సుమారు లక్ష రూపాయల వరకు పెట్టుబడి అవుతుండగా, రెండోసారి కొన సాగించినప్పుడు రూ.20 వేల వరకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. అరటిపై పెట్టుబడి ఖర్చు కౌలు రైతులకు మరింత అధికంగా ఉంటోంది.



ఆరు ఎకరాల్లో అరటి వేశా

పొలం కౌలుకు తీసుకొని ఆరు ఎకరాల్లో అరటి సాగు చేస్తున్నా. సేద్యం, మందులు, ఎరువుల ధరలు పెరిగిపోయాయి. ఎకరాకు సుమారు లక్ష రూపాయల వరకు పెట్టుబడి ఖర్చు వస్తోంది. పంట చేతికొచ్చిందిలే.. పెట్టుబడి పోనూ కొంత మిగులుతుందనుకుంటే సరైన ధర లేక నష్టపోవాల్సి వస్తోంది.

– మాభువలి, రైతు, కంభం



మార్కెట్‌కు తరలించేందుకు కంభం సమీపంలో సిద్ధం చేసిన గెలలు



పంట చేతికొచ్చే వరకు నమ్మకం లేదు

రెండు ఎకరాల్లో అరటి తోట వేసి బోరు నీళ్లతో సాగు చేస్తున్నా. ఎప్పుడు తుఫాన్లు వస్తాయో, గాలులు వస్తాయో తెలియని పరిస్థితి. ఏడాది పాటు పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నాక గెలలు చేతికొచ్చే సమయంలో పెనుగాలులు, తుఫాను వచ్చి గెలలతో సహా అరటి చెట్లు నేలకొరిగి పోయిన సందర్భాలున్నాయి. గిట్టుబాటు ధర దక్కితేనే అరటి రైతులు గట్టెక్కుతారు.

– వెంకట రమణ, రైతు, కంభం

భారీగా తగ్గిన ధరలు

పశ్చిమ ప్రకాశంలో పండిన అరటిని ఎక్కువగా గుంటూరు మార్కెట్‌కు తరలిస్తుంటారు. ప్రస్తుతం అరటి గెలల ధరలు భారీగా తగ్గిపోయాయి. ముందుగా కాపు వచ్చిన సమయంలో గుంటూరు మార్కెట్‌లో రూ.250–రూ.350 పలికిన అరటి గెల ధర నేడు రూ.100 నుంచి రూ.150 మధ్యకు పడిపోయింది. ఒక్కోసారి పెద్ద గెలలు కూడా రూ.100 లోపు పలుకుతున్నాయని రైతులు వాపోతున్నారు. గుంటూరు మార్కెట్‌కు తీసుకెళ్లినా ఖర్చులు పోగా వంద రూపాయలకు మించి గెల ధర పలకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిద్దలూరు, బేస్తవారిపేట, కంభం పరిసర ప్రాంతాల నుంచి గుంటూరుకు గెలలు తరలించాలంటే కూలీలతో కలిపి గెలకు రూ. రూ.40 నుంచి రూ.50 వరకు ఖర్చవుతోంది. ఇంత ఖర్చు భరాయించి మార్కెట్‌కు తీసుకెళ్లినా వంద రూపాయలు దాటి గెలలు ధర పలకడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో గెలలు కోసేందుకు రైతులు భయపడుతుండటంతో అవి తోటల్లోనే మాగిపోతున్నాయి. పెట్టిన పెట్టుబడి కూడా రైతులకు రావడం లేదు.

కష్టం రైతులది.. లాభం దళారులది

పశ్చిమ ప్రకాశంలో పండిన గెలలు గుంటూరు లాంటి దూర ప్రాంతాలకు తరలించేందుకు ఖర్చు ఎక్కువగా ఉండటంతో కొందరు రైతులు స్థానికంగా ఉండే హోల్‌సేల్ దుకాణాలకు తరలిస్తున్నారు. రైతులు తెచ్చిన గెలలను హోల్ సేల్ వ్యాపారులు బట్టీలో వేసి మరుసటి రోజు తెల్లవారుజామున వేలం పెట్టి ఆ తర్వాత వారి కమీషన్, బట్టీ కూలీ, ఆటో కూలీ తీసుకుని మిగిలిన డబ్బును రైతులకు చెల్లిస్తారు. ఇతర ప్రాంతాల నుంచి కూడా ఇక్కడికి అరటి గెలలు వస్తుండటంతో ధరలు పూర్తిగా పడిపోయాయి. పెద్ద సైజు గెలలు కూడా వంద రూపాయలలోపే పలుకుతున్నాయి. బయటి మార్కెట్‌లో మాత్రం డజన్ అరటి పండ్లు రూ.60 వరకు విక్రయిస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే కష్టం రైతులది.. లాభం మాత్రం దళారులది, వ్యాపారులదిగా మారింది. ప్రభుత్వం దళారీ వ్యవస్థను నిర్మూలించి అరటికి గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



గుంటూరు మార్కెట్‌కు తరలిస్తున్న అరటి

ధీమా లేని బీమా!

పంట నష్టపరిహారం, బీమా వస్తుందన్న నమ్మకం లేదని రైతులు పోతున్నారు. రైతు భరోసా డబ్బు ఖాతాల్లో పడి ఉంటే కొంత వరకు పెట్టుబడులకు ఉపయోగపడేవని రైతులు చెబుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు ధరలు లేక, తుఫాను, ఇతర ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోతున్నామని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



కంభం సమీపంలో సాగులో ఉన్న అరటి తోట

ప్రేమింతుము.. పూజింతుము!



ఒంగోలు పునీత చినథెరేసమ్మ చర్చిలో క్రీస్తు జననం సెట్టింగ్

విశ్వమంతా ప్రేమ, కరుణ మాధుర్యాలను అందించేందుకు సిరి నవ్వులు చిందిస్తూ కరుణామయుడు ఉదయించిన క్రిస్మస్ పర్వదినాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచే మొదలైన క్రిస్మస్ సంబరాలు బుధవారం రాత్రి వరకు కొనసాగాయి. విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేసిన ప్రార్థనా మందిరాల్లో విశ్వాసులు భక్తి శ్రద్ధలతో ఏసుక్రీస్తును స్తుతించారు. పలు చర్చిల్లో చిన్నారులు క్రీస్తు జనన ఘట్టాన్ని నృత్య రూపకంగా ప్రదర్శించారు. యెహోవా, ఏసును కొనియాడుతూ భక్తి గేయాలు ఆలపించారు. ప్రార్థనల అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేసి సంతోషంగా గడిపారు.

– సాక్షి నెట్‌వర్క్



పునీత చినథెరేసమ్మ చర్చిలో బాలఏసును ముద్దాడుతున్న విశ్వాసులు



ఒంగోలు జేఎంబీ చర్చికి భారీగా హాజరైన క్రైస్తవులు



సంతనూతలపాడులో ప్రార్థనకు హాజరైన విశ్వాసులు



క్రీస్తు గీతాలకు సంగీతం అందిస్తున్న కళాకారులు



దర్శిలో ప్రార్థనలో పాల్గొన్న భక్తులు



మార్కాపురం తెలుగు బాప్టిస్ట్ చర్చిలో



పెద్దదోర్నాలలోని హీలింగ్ టెంపుల్‌లో చీరల పంపిణీ



గిద్దలూరులోని జీసస్ హోలీ చర్చిలో ప్రార్థనలు



పొన్నలూరు బాప్టిస్ట్ చర్చిలో క్రీస్తు ఆరాధన

మళ్లీ రాకు సునామీ!



ఉలవపాడు మండలం బట్టిసోమయ్యపాలెంలో కోర్టు ఉద్యోగులు నిర్మించిన సునామీ కాలనీ

ఉలవపాడు: సునామీ ఈ పేరు వింటేనే తీరప్రాంత గ్రామాలు వణికిపోతాయి. సరిగ్గా 20 ఏళ్ల క్రితం 2004 డిసెంబర్ 26న సునామీ పంజా విసిరింది. అందరూ ప్రశాంతంగా ఉన్న సమయంలో బంగాళాఖాతం నుంచి అలలు ఉవ్వెత్తున ఎగసి గ్రామాలను ముంచెత్తాయి. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలు ఈ సునామీ తాకిడి గజగజ వణికిపోయాయి. తాటి చెట్టు అంత ఎత్తున ఎగసి పడి తీరప్రాంత గ్రామాల్లోకి సముద్రం నీరు చేరింది. దేశం మొత్తం మీద దాదాపు 1000 మంది ఈ సునామీ దాటికి మృతి చెందగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 20 మంది, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 22 మంది మృతి చెందారు. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో ప్రధానంగా గంగపాలెం, పల్లెపాలెం గ్రామాల్లో అధిక శాతం మంది మరణించారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలంలో 12 మంది మృతి చెందారు. మత్స్యకారులు ఈ సునామీ ధాటికి వణికిపోయారు. కళ్లెదుటే కుటుంబసభ్యులను పోగొట్టుకున్నారు. ఉప్పుకొఠారులలో పనికి వచ్చిన వారు, సముద్ర స్నానానికి వచ్చిన వారు, అలలు అల్లుకుంటూ సముద్రం పక్కన పనిచేసుకుంటున్న వారు ఈ అలల తాకిడికి బలైపోయారు. ఇలాంటి ఘోర విపత్తు జరిగి 20 ఏళ్లు గడిచినా సునామీ అనే పదం వింటనే మత్స్యకారుల గుండెల్లో తీరని వేదన కనిపిస్తుంది. ఆ రోజు గురించి ఇప్పుడు తలచుకున్నా భయం కనిపిస్తుంది.

కొద్ది గంటల్లోనే బాధితుల వద్దకు అప్పటి సీఎం వైఎస్ఆర్

సునామీ వచ్చిన రెండు గంటల్లోపే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రకాశం జిల్లాలోని ఊళ్లపాలెం గ్రామానికి వచ్చి మృతి చెందిన వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అప్పట్లో ఆయన వెంటనే స్పందించి బాధిత ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అప్పట్లో అధికారులు సైతం అందుబాటులోకి రాలేదు. అక్కడ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న అమరేశ్వరరావు అనే ఉపాధ్యాయుడిని వైఎస్సార్ హెలికాప్టర్ దిగిన తరువాత కారులో ఎక్కించుకుని బాధిత ప్రాంతానికి వచ్చారని ఊళ్లపాలెం కాలనీవాసులు అంటారు. ఆయన కూడా మృతి చెందాడు. కానీ అప్పటి ఆ సంఘటనలు మాత్రం ఇంకా వారి మనసులో ఉన్నాయి. స్వచ్ఛంద సంస్థల సహకారంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకుంది. వారికి మంచి ఇళ్లను కట్టించి ఇచ్చారు. బ్యాంకుల ద్వారా రుణాలు అందించి మత్స్యకారులను మళ్లీ వేటకు వెళ్లేలా చేశారు. కానీ డిసెంబర్ నెల అంటేనే తుఫాన్లు సునామీ అనే భయం వెంటాడుతుంది. ఉలవపాడు మండల పరిధిలోని బట్టి సోమయ్యపాలెంలో కోర్టు సునామీ కాలనీ పేరుతో హైకోర్టు లాయర్లు, జడ్జిలు ఉచితంగా నిర్మించి ఇచ్చారు. రామాయపట్నంలో కాసా స్వచ్ఛంద సంస్థ గృహాలను నిర్మించి ఇచ్చింది. అలాంటి సునామీకి నేటితో 20 ఏళ్లు పూర్తయ్యాయి.



జ్యుడిషియల్ సిబ్బంది నిర్మించిన కాలనీ శిలాఫలకం

నమ్మకంగా ఉంటూ నగలు కొట్టేసింది

- కనిగిరి చోరీ కేసులో నిందితురాలిని అరెస్టు చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ దామోదర్



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: బంధువుల అమ్మాయేకదా అని నమ్మితే చివరికి ఆ ఇంటికే కన్నమేసింది ఓ కి'లేడీ'. ఇటీవల కనిగిరిలో చోటుచేసుకున్న చోరీ కేసుపై దర్యాప్తు చేపట్టిన పోలీసులకు అడ్డంగా దొరికిపోయింది. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చోరీ కేసు వివరాలను ఎస్పీ ఏఆర్ దామోదర్ వెల్లడించారు. కనిగిరికి చెందిన బత్తుల వెంకట రమణ, వేముల అఖిల బంధువులు. అఖిల తరచూ రమణ ఇంటికి వచ్చి పోతుండేది. బీరువాలో నగలు, డబ్బుతోపాటు ఇంటి తాళాలు ఎక్కడ పెడుతున్నారో గమనిస్తూ వస్తున్న అఖిల.. చోరీకి పథకం పన్నింది. గత నవంబర్ 4వ తేదీన ఎవరూ లేని సమయంలో రమణ ఇంటికి వచ్చిన అఖిల మెట్ల కింద దాచిపెట్టిన తాళాలు దర్జాగా తీసుకుని లోపలకు ప్రవేశించింది. బీరువా తాళాలు తీసి రూ.12.50 లక్షల విలువైన 25 సవర్ల బంగారు నగలు దొంగిలించింది. ఆ తరువాత ఏమీ తెలియనట్లు అక్కడ నుంచి చల్లగా జారుకుంది. ఇంటికి వచ్చి చూసిన రమణ చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలో దిగిన పోలీసులు అసలు నిందితురాలిని గుర్తించారు. దొంగలించిన బంగారు నగలను విక్రయించేందుకు అఖిల ఒంగోలు వెళ్తుండగా కనిగిరి ఆర్టీసీ డిపో వద్ద అరెస్టు చేశారు. రికవరీ చేసిన బంగారు నగలను ఎస్పీ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. కేసును ఛేదించిన కనిగిరి సీఐ షేక్ ఖాజావలి, ఎస్ఐ టి.శ్రీరాం, హనుమంతునిపాడు ఎస్ఐ మాధవరావు, హెచ్‌సీలు ఏ.శ్రీనివాసులు, రామయ్య, పీసీలు బాలగురవయ్య, బీవీ కాశీరాంను ఎస్పీ అభినందించారు.